***అందమైన ఆడదాన్నిచూస్తే అనుభవించాలనే ఆలోచిస్తాడు మగవాడు. "ఆడది సహకరించక పోతే మగవాడేం చెయ్యగలడు?" అన్న లోకాభిప్రాయమూ అందుకు తోడు పడుతోంది. ఈ యిరు పక్షాల వత్తిడిలో నలిగిపోయే దెవరు?***


పెద్దకథ

# పొగడపూలు

శ్రీ ఆర్. యస్. కె. మూర్తి

**మార్నింగు లోకలు వచ్చి నిలబడింది. స్టేషనులో. బిలబిలమంటూ కూలీలు దిగి వచ్చారు. కంట్రాక్టరు రామస్వామి నేను తెమ్మన్న పుస్తకాలు పత్రికలతోపాటు అనేక వస్తువులతో వాముందు దిగబడ్డాడు.**

జామ్‌లు, పికిల్సు, బిస్కట్లు- ఏవేవో తీసుకొచ్చాడు. ఎందుకయ్యా నాకివన్నీ అంటే వినడు. "ఉంచండి సార్. ఈ అడవిలో ఒంటరిగా ఉంటున్నారు. ఉంచండి" అని ముద్దు చేస్తాడు. చేస్తాడంటే నామీద ముద్దుతో కాదనుకోండి. అతని వెంట వచ్చిన కూలీల సంఖ్యనూ, అతనిచ్చిన టికెట్ల సంఖ్యనూ నేను పోల్చి చూసుకోకుండా ఉండాలని తాపత్రయం.



రామస్వామి వ్యాపారస్తుడు. మా స్టేషను చుట్టూ అడవి. దానినిండా కుంకుడుచెట్లు. వాటి పాటదారు అతను. వారానికోసారి కూలీలతో వచ్చికుంకుళ్ళు కోయించి తీసుకెళ్తుంటాడు. వారి రాకతో వారానికోసారి నేను నాకీ ప్రపంచంతో సంబంధం ఉన్నదనే సత్యాన్ని రుజువు చేసుకుంటుంటాను- నా మనస్సులో. అతను తెచ్చిన వస్తువులకంటె, అతని రాకే నా ఒంటరి బ్రతుకుకెంతో ఆనందాన్ని యిస్తూ ఉంటుంది.

కాని ఆ రోజు అతన్ని నోరారా పలకరించలేకపోయాను. అతను తెచ్చిన వస్తువులను నిర్వికారంగా స్వీకరించి, అతడ్ని పంపివేశాను. నా మనస్సంతా "సుశీల" మీదనే లగ్నమైవుంది. రాత్రి యెంత విచి

త్రంగా వచ్చిందో తెల్లవారే టప్పటికి అంత విచిత్రంగా మాయమైపోయింది. ఈ అడవిలో యెక్కడని వెతగ్గలను? అయినా పోర్టర్లను పంపాను. వాడు తెచ్చే వార్తకోసం ఆత్రంగా వున్న నేను రామస్వామి రాకను పట్టించుకోలేదంటే ఆశ్చర్యమేమున్నది?

కాసేపటికి రామస్వామే పరుగెత్తుకొచ్చాడు. కన్యల కొలను యెన్నడూ లేని దానడు నీటితో నిండి వున్నదిట! ఆ నీటి మీద ఒక స్త్రీ శవం తేలి వున్నదిట!

పరుగెత్తికెళ్ళి చూశాను నా భయం అబద్ధం కావటానికి, ఆ శవం మరొకరిది కావటానికి, నిర్మానుష్యమైన ఆ అడవిలో అవకాశమేలేదు. అది సుశీల శవమే! ప్రశాంత సరోవరపు అలలపై తేలియాడే కలువలా వుంది. జుగుప్సకు బదులు నిర్మలతను వెదజల్లుతున్నది.

కాని కూలీలు చూస్తున్నది ఆమెను కాదు. ఎన్నడూ నీటిచుక్క నిలవని కన్యల కొలనులో అంత నీరు నిండి వుండటం వారిని ఆశ్చర్యపరుస్తున్నది. నన్నైమో ఆమెను గురించిన ఆలోచనలే పెనవేసుకున్నాయి. ఈ చావుకి నేను కూడా కారకుడినేనా??

నిజానికి 'సుశీల' ఎవరో నాకు తెలియదు. మునుపెక్కడో యెప్పుడు చూసిన గుర్తే. అది కేవలం యాదృచ్ఛికమూ కావచ్చు. ఆమె ఎవరో, ఏమిటో నాకేమీ తెలియదు. ఆమెతో నా పరిచయం కొన్ని గంటలు మాత్రమే. అసలా పరిచయమే విచిత్రంగా జరిగింది. ఆమె నేనున్న స్టేషనులో యెందుకు దిగిందో నాకు తెలియదు. ఆ క్రిందటి రోజు సాయంత్రం లోకలు అప్పుడే వచ్చి వెళ్ళింది. ఇంతలో పోర్టరు వచ్చి చెప్పాడు- అయ్యా, మన స్టేషనులో యెవరో ఆడమనిషి దిగిందయ్యా. నేను ఆశ్చర్యపోయాను.

నేనున్న స్టేషనులో సామాన్యంగా యెవరూ దిగరు. చెప్పాలంటే, అదో అడవి మధ్య స్టేషను. కేవలం కంపెనీ రవాణాకోసం కట్టిన స్టేషనది. నారానికో



ఒక మేధావి కలములోని సిరా. యుద్ధ రంగంలోని సైనికునికంటే గొప్పది.

—మహమ్మద్

* * *

నాగరికత కదలికేకాని స్థితికాదు. ప్రయాణమే కాని హార్బరు కాదు.

—అర్నాల్డ్ టాయన్‌బీ

* * *

నేరం చేసినవాడు భయపడతాడు. భయపడినవాడు శిక్షకు దగ్గరౌతాడు.

—వోల్టేర్

* * *

పడినవాడికంటె పడి లేచినవాడు గొప్పవాడు, ఎందుకంటే వాడు గోతులు చూశాడు.

—ఎమర్సన్

సేకరణ: **ఎస్. బషీర్ అహ్మద్**

సారి కంట్రాక్టరు కూలీలతోవచ్చి, కాయలు కోయించు కెళ్తుంటాడు. ప్రపంచంతో నాకున్న సంబంధమల్లా ఈ కంట్రాక్టరూ, కూలీలే.

కాకపోతే స్టేషనుకి కొద్ది దూరంలో ఒక విచిత్రమైన కొలనుంది. అదే కన్యల కొలను. నిజానికదో పెద్ద గొయ్యి. కాని దాంట్లో ఏ రాయన్నా వేస్తే, బుడబుడమంటూ నీరు పుట్టుకొస్తుంది. వచ్చిన నీరు వచ్చినట్లే యింకిపోతుంది. విజ్ఞానశాస్త్రమింకా వివరించని సృష్టి విచిత్రాలలో అదొకటి!

అలాంటి కొలను చుట్టూ కథలూ గాథలూ, పరుచుకొని ఉండటంలో వింతేమున్నది! ఆ కొలను ఒక కన్యట. అపవిత్రుల స్పర్శ సోకితే, ఆ నీరు అలా పెకివచ్చి, ఆమెను పునీతను చేస్తుయ్యట. పవిత్రులైనవారు ఏ రాయన్నా వేసినా ఆ నీరు అలా పైకి రాదుట. కాని యింతవరకూ అలాంటి పవిత్రులెవ్వరూ అక్కడికి వచ్చినట్లు లేదు. ఈ కొలను చూడటానికి విజిటర్సు అప్పుడప్పుడు గైడ్సుతో వస్తుంటారు. ఆ రోజు మాకో పెళ్ళిరోజు.

పోర్టరు వచ్చి చెప్పినప్పుడు ఈమె కూడా అలాగే వచ్చిందేమోననుకున్నాను. కాని ఒంటరిగా చేతిలో సంచీ కూడా లేకుండా వచ్చిన ఆమెను చూస్తే అనుమానమేసింది. కాని ఆమెతో నాకు లభించిన ఒంటరితనం! దానితో నన్నావరించిన పశుత్వం! ఇవి నన్నామెను గురించిన వివరాలలో యింటరెస్టు చూపించనీయలేదు. ఆమె శరీరమే నన్ను యింటరెస్టు చేసింది.

ఇప్పుడా శరీరాన్నిలా శవంగా చూస్తుంటే మనసంతా దేవినట్లయింది. రాత్రి నేనన్న మాటలకు ఆమె ప్రాణత్యాగం చేసుకోలేదుకదా?

రాత్రి పోర్టరామెయెడ అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె చెప్పు వాడి ముఖాన వీరవిహారం చేసింది. వాడి పాపంలో నేనూ భాగస్వామినేకదా? వాడ్ని కోపపడటానికి బదులుగా ఆమెనే మందలించాను. "ఆడది అలుసు యివ్వకపోతే మగవాడు ధైర్యం చేస్తాడేమిటి?" అని ఆమెను అవమానించాను. ఆ క్షణంలో నేనలా ఎందుకన్నానో నాకు తెలియదు. చదువు, సంస్కారం, యివన్నీ నన్ను ఆ మాట ఎలా అననిచ్చాయో? ఆమాటకామె ప్రాణత్యాగం చేసుకోలేదు కదా?

అంత మాత్రానికే ప్రాణం తీసుకుంటారా ఎవరైనా? అంతగా కోపమొస్తే ఆ పోర్టరుని కొట్టినట్టే.... అబల ఒంటరిదీ ఒక అధికారిని- నామీద చెయ్యి చేసుకోలేకపోతే కనీసం నన్ను అసహ్యించుకోవచ్చుగదా ? నా పాపానికి నన్నే వదిలివేయవచ్చునుకదా?.... ఆమె చావుకి నేనన్న మాట కారణమై ఉండదు. ఎక్కడోచేసిన పాపాన్ని యిక్కడ చావుతో కప్పివేసుకుంది- "సుశీల"

"పాపాత్మురాలు. కొలను మహత్యం చెడగొట్టింది. అపవిత్రురాలి శరీరమంటే టప్పటికి నీళ్ళు యింకిపోలేదు. ఎక్కడ ఏం పాపం చేసిందో ?" రామస్వామే కాబోలు అంటున్నాడు.

పాపాత్ముడు! నైటు హాల్టు స్టేషనులో చేసిన రోజున కూలీలతో.... ఛీఛీ నన్నూ కలుషితం చేసిన పాపాత్ముడు!

"అంతేనండీ బాబూ, ఎక్కడో చేసిన పాపాన్ని యిక్కడ కప్పేసుకుంది. నీతిమాలిన .." వయస్సు మళ్ళిన కూలీ! ముఖాన రూపాయి కాసంత బొట్టు! అది దేవిలా ఉన్న కూలీ అన్న మాటలవి!

అంతే అయ్యుంటుంది! ఎక్కడో చేసుకున్న పాపాన్నే.... అంతే కాని నేనన్న మాట ఆమె చావుకి కారణమై ఉండదు. ఆదిహనీయిచ్చినతీర్పులోనాకేదోవిడుదల!


ఉచితము! ఉచితము!

**తెల్లమచ్చలు**

అన్ని రకాల మచ్చలను, ఎడఫ రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మాన్పును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచార నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయుము. వివరాలకు

Bharat Ayurvedashram
P.O. Katri Sarai (Gaya)

మరిప్పుడీ శవాన్ని యేం చేసేటట్లు? బయటి ప్రపంచంతో సంబంధములేని చోటది.

గగన మార్గంలో వెళ్తుంటారు. పార్వతీ పరమేశ్వరులు. భూలోకంలో ఒక పాడుపడ్డ గుడిలో కాళ్ళు నేలమీదను. చేతులు ఆకాశంలోకి పారేసి పాట పాడుతుంది ఓ పతివ్రత. ఆ పాట అలా, అలా వెళ్ళి యెనభై వాయిద్యాల మోతతో, ఆది దంపతుల చెవిలో పడుతుంది. ఆహా దేవా! ఏమిటో ఆ ఆర్తనాదం? అని అడుగుతుంది పరమేశ్వరి ... దాంతో మూడు గంటల సినిమా కథ నడిచిపోతుంది

నేను గగన మార్గానువర్తిని కాక పోయినా. భూలోకం నుంచి వేరుచేయబడ్డ వాడినే. రికమండేషన్లు లేని నీకు ఉద్యోగమూ యిచ్చి. మంచి చోటులో నూ వేస్తామా అన్నట్లు. నన్నీ అడివిలో ఎ.ఎస్.ఎం.గా పోస్టు చేశారు. అటువైపుగా వచ్చేవి రోజు మొత్తం మీద రెండు లోకల్సు. రైల్వేభాషలో ఒకటి ధరీడౌన్. రెండవది టెన్ అప్. ప్రొద్దుటొకటి ప్రొద్దు గ్రుంకిన తర్వాత ఒకటి. ఆ రైళ్ళ కూత పతివ్రత పాటలాగా. నన్నీ భూప్రపంచం లోకి లాక్కు వస్తుంది. ఓ మూడు నిమిషాల సినిమారీలు తిరిగిపోతుంది. లైట్లువేసి నట్లుగా శూన్యపు తెర. దుర్భరమైన ఒంటరితనం! నన్నావరించుకొని ఉండే నిశ్శబ్దత. ఆ రైళ్ళనలా దొటయిదాకా పంపి వచ్చి. తిరిగి నన్నావరించుకొంటుంది. కాబట్టి ఇప్పుడు ఫోనులో చెప్పినా సాయంత్రానికి కాని బండి లేదుకదా? అప్పటి దాకా ఈ శవాన్ని ఏం చేసేటట్లు?


శవాన్ని బయటకు తీయించి, వెయిటింగు రూములో పెట్టించాను సాయంత్రం పోలీసులు వచ్చేవరకు ఎదురు చూస్తూ కూచోటంతప్ప నేను చెయ్యగలిగిందేమీ లేదు కదా?

*　　*　　*

ఆ క్రిందటి రోజునకూడా అలాగే లోకలు కూత వినటానికి రెడీగా కూచున్నాను. పతివ్రత ఆర్తనాదం కోసం ఎదురు చూస్తూ తిరిగే ఆది దంపతులకి మల్లే.

అలా ఒంటరిగా వున్నప్పుడే నామీద నాకు ఎంతో అసహ్యం వేస్తుంటుంది అలా ఒంటరిగా కూర్చొన్నప్పుడు అందమైన కలలు కనాలని ప్రయత్నిస్తుంటాను మనస్సు ఎక్కుపోజుడు పిలింకిమల్లే తెల్లబోతుంది అందమైన రూపాల్ని ఊహించుకోవాలని ఆశిస్తాను. ఏ రూపమూ నేను కోరుకున్నంత అందంగా ఉండదు చక్కటి మాటలతో కథలల్లుకోవాలని ఆశిస్తాను. మాటలే దొరకవు. అందమైన సంఘటనలు విచిత్రమైన సన్నివేశాలు, స్టైయిలిష్‌గా ఉండే సంభాషణలు ఇవేవీ ఊహామాత్రంగానైనా నాకు అనుభవంలోకిరావు ఒకప్పుడెప్పుడో చదివిన కథ. ధనికొండవారిదని గుర్తు. ఒక అందమైన స్త్రీ బాతరూములో స్నానం చేస్తుంటుంది. ఆమెను ప్రేమించిన పురుషుడు బయటనుంచి ఆవిడతో సంభాషణ మొదలు పెడ్తాడు. లోపల నగ్నంగా వున్న ఆమె, ఆ మాటలు తన నగ్నత్వాన్ని ఆయన ముందుకి తీసుకెళ్తున్నయ్యని సిగ్గుపడుతుంది. ఇది సెక్సు కథ కాదు. ఎంత చక్కటి సన్నివేశం! ఎంతటి అందమైన అనుభవం! ఇటువంటివేమీ నా వూహాల లోకిరావు. బుచ్చిబాబు చెప్పిన సౌందర్య రాహిత్యమంటే యిదేనేమో?

లోకలుకూత వినిపించింది. బండివచ్చి నిలబడింది వచ్చిన గార్డుతో రెండు జోకులు విసరటం మూడు నిమిషాల సినిమాలో హాస్య సన్నివేశం. జాకబ్ వచ్చాడు. వచ్చి బూతులు మాట్లాడుతాడు- "వాట్ యంగ్ మాన్. ఎన్ని రోజులిట్లా హాట్ బెడ్ మీద దొర్లుతావు? ఏ బిచ్ నన్నా చూసుకొని...." అంటూ గారపళ్ళు బయటపెట్టి



నవ్వుతూ విజిల్ వేసుకుంటూ వెళ్ళి పోయాడు.

అతనన్న మాటలు శరీరాన్నేదో భగ్గు మనిపించినై. ఎంత అసభ్యంగా మాట్లాడాడు? అక్కడికి నేనేదో పవిత్రుడనని కాదు. అక్కడక్కడా ఎంగిలిపడ్డవాడినే. వారం వారం వచ్చే రామస్వామి నేనడిగిన పత్రికలు, అడగని వస్తువులతోపాటు. నేనడుగలేనివి కూడా నాకు సమకూరుస్తూనే వుంటాడు. కుర్రకూలీ నౌకదానికి కాయలు కోయించుకోకుండానే రోజు కూలీ చెల్లిస్తుంటాడు. ఆ దొక వికృత జీవితం! ఆ క్షణంలో ఏదీ తప్పని అనిపించదు. ఆ ఒంటరితనంలో ఏదీ పాపమనిపించదు. ఆ తర్వాత ఎంతో బాధపడుతుంటాను. నేనూహించుకొనే సన్నివేశ సౌందర్యం, నా అనుభవంలోకి వచ్చే మురికి సన్నివేశాలు- ఏమిటీ ఐరనీ! కాని, యిదంతాదాని గుంట వైరాగ్యం! రామస్వామి రాగానే కళ్ళు మళ్ళీ కూలీల గుంపునే వెతక బోతై. టి.సి.లు. గార్డులు రైళ్ళలోనే ఇలాంటివి సాగిస్తుంటారుట, జాకబ్ అంత కంటే బాగా యెట్లా మాట్లాడగలడు? నేనూ కొన్ని రోజులు ఈ జీవితాన్ని యిలాగే గడిపితే. జాకబ్ లాగానే మాట్లాడుతానా? అయ్యో....మనసు గిజెట్టి యేడ్చింది. ఉద్యోగం మానేసి, ఈ ఒంటరితనాన్ని వదిలేసి మనుషుల మధ్యకు వెళ్ళి. పెళ్ళి పెటాకులు చూసుకుంటే, ఈ జీవితం జాకబ్ స్థితికి దిగజారకుండా వుంటుందేమో? కాని వదిలేసి వెళ్ళగలనా?

“అయ్యగారూ, మన స్టేషనులో ఎవరో ఆడమనిషి దిగిందండీ” అన్న పోర్టరు మాటలతో తిరిగి స్పృహలోకి వచ్చాను.

“నమస్కారమండీ-” అంటూ ఒక యువతి ముందుకొచ్చింది. సామాన్యమైన చీర. మనిషి నిర్వికారంగా ఉంది. చెవులకు. చేతులకులేని దీనత్వంలో లేదు. మెళ్లో ఓ చిన్న గొలుసు. సామాన్య కుటుంబీకురాలే కావచ్చు. కాని ఆమెను చూడగానే నాకు కలిగిన వికారం- అదొక ఆటవిక వికారం!

ఆడదాన్ని చూడగానే కలిగే ఈ వికారాన్ని ఎలా నిరోధించుకోవాలో? ఏ సంస్కారం. ఏ చదువు పురుషుణ్ని ఈ పాపం నుంచి రక్షిస్తాయో? అఫ్ కోర్స్. ఇది నా డివైన్ మోమెంట్సులో వచ్చే ఆలోచన.

అప్పటికి మాత్రం నా కళ్ళు ఆమె ఎదపైననె నిలిచిపోయినై. పమిటె నిండుగా కప్పుకొని ఉన్నట్లయితే, ఆ నిర్మానుష్య వాతావరణంలో ఆమె కొంకొంత గౌరవస్థానం లభించి వుండేదేమో, అల వోకగా వదిలిన పైట. నిండు యౌవన సంపద. సున్నితమైన పెదవులు. నాజూకైన నడుం, నా కళ్ళు యింకా దేనినో వెతుకుతున్నయి. నేనలా చూస్తుంటే ఆమె చీర లోపలి భాగాలకే నా చూపులు చొచ్చుకుపోయి చూస్తుంటే- నిజానికామె కుంచించుకుపోవాలి. కానిఆమెలోఅలాంటి వికారమే కన్పించలేదు.

“ఎవరమ్మా, యిలా వచ్చారు?” అని ప్రశ్నించాను. పాతికేళ్ళ యువకుడిని. నిండు జవ్వని ఆమె. అమ్మా, బొమ్మా అనకుండా 'మిస్' అని స్టైయిలిష్‌గా అడ్రసుచేస్తే బాగుండేదేమో?

“టికెట్టు లేకుండా రైలెక్కాను. టి.సి. యిక్కడ దించేశారు.” అంతేనా సమాధానం! యింకేమీలేదా చెప్పటానికి?

కాని యింత అందమైన స్త్రీలను, ఇంత సెక్సీగా వున్న యువతులను టి సి. లు యిలా అడవిలో దించేస్తారా? హాయిగా ఫస్టు క్లాసులోనో తీసుకుపోరూ?

అయితే అలా ఫస్టుక్లాసులో ప్రయాణం చెయ్యటానికి అందరూ అంగీకరిస్తారా?... ఆ క్షణంలో నాకు కలుగని అనుమానమది. సంస్కార రాహిత్యం, నన్ను పట్టి పీడిస్తున్న వంటరి దయ్యపు ప్రభావం!

“టి. సి. దించేశాడా? ఇదో అడవి. రేపు పొద్దునదాకా మళ్ళా ఏ బండీ లేదే?”

ఆ రాత్రి ఆమె యిక్కడే గడుపక తప్పదనే సత్యం నాలో ఎన్నో దుర్మార్గపు ఆలోచనలను రేపెట్టింది.

“ఇక్కడేమీ ఊరు లేదా?” ఆమె ప్రశ్న.

“ఊరా? ముప్పయి మైళ్ళలోపు ఎటూ మానవ సంచారమనేదే లేదు.”

“మరైతే యిక్కడ స్టేషనెందుకు?”

చెప్పాను. కుంకుళ్ళు, కన్యలకొలను.

“కన్యలకొలనా? విచిత్రంగా వుందే! ఇక్కడి కెంతదూరం?”

“రేపొద్దున చూద్దురుగానిలెండి. పదండి. వెయిటింగు రూములో కూర్చుందురుగాని.”

ఆమె ఏమీ మాట్లాడలేదు. ఒక జడ పదార్థంలా నడిచి వెళ్ళింది, వెయిటింగు రూముకి.

ఎక్కడో చూసిన ముఖమల్లే వుంది యెవరో గుర్తులేదు. జాకబ్ గుర్తుకొచ్చాడు ఏ బిచ్‌నన్నా....ఛీ.ఛీ. మురికి మాటలు!

క్వార్టర్సు యిచ్చారు రైల్వేవారు. కాని అక్కడుండే ఒంటరితనం మరీ దుర్భరంగా వుంటుంది. వంట- భోజనం మాత్రం అక్కడచేసి, మిగిలిన కాలాన్నంతా స్టేషన్లో గడిపేస్తుంటాను, ఫోను తోడుగా. ఆ అడివికో చివర సుమారైన గ్రామం. పోరదది ఆ వూరే. ఇంకో డ్యూటీ ఎ.ఎస్.ఎమ్ కూడా అక్కడినుంచె వస్తుంటాడు. రోజుకో పోర్టరు నైటు డ్యూటీలో పడుకుంటాడు. నేనూ ఆ గ్రామంలోనే ఉండవచ్చు. ఎందుకో ఉండటంలేదు.

ఆ రాత్రి ఆమెకు నేనే వంటచేసి పెట్టాను భోజనం చేస్తున్నప్పుడు అడిగాను “మీదే ఊరండీ?” అని.

“మీకంటె చిన్నదాన్ని. మీరు అండీ అంటే ఆయుక్షీణం”

“అదో చాదస్తం. సభ్యత అనేది ఒకటుంటుంది కదండీ”

“థ్యాంక్సు. ఇలా వచ్చిన నా విషయంలో కూడా మీరు సభ్యతచూప గలుగుతున్నారంటే, మీ సంస్కారం గొప్పదై వుండాలి. నాకీ లోకంమీద మళ్ళా ప్రేమ పుట్టుకొస్తున్నది. మిమ్మల్ని చూస్తుంటే మా తమ్ముడు గుర్తుకొస్తున్నాడు ....”

అంటూ ఏదో చెప్తున్నదల్లా గొంతు నొక్కిన రేడియోకిమల్లే టక్కున మాటల్ని ఆపేసింది.

నేనన్న మాటతో నాకే బంధం వేసింది. తన వివరాలు చెప్పటానికి యిష్టంలేని స్త్రీని. వాటికోసం ఒత్తిడి చెయ్యటం సభ్యత కాదుకదా?

సభ్యత అన్నానేకాని, ఆమెను చూసినా మనస్సు, వయస్సు చాలా అసభ్యమైన ఆలోచనలే చేస్తున్నాయి. జాకబ్ మాటలు. ఏ బిచ్‌నన్నా.... తమ్ముడంటుం దేమిటి, ఈవిడ!

ఈమె అందుకు అంగీకరిస్తుందా? అయితే టి. సి. ఎందుకు దింపేస్తాడు? ఏమైనా నేనీమెను అడగగలనా, శరీరాన్ని నాకప్పగించమని? వెయిటింగురూములోనే ఆమెకు పక్క ఏర్పాటుచేశాను. వెళ్ళి తలుపు తడితే?

వరండాలోకైతే వెళ్ళాను కాని తలుపు తట్టటానికి చేతులు రాలేదు.

నాకు ఆడవాళ్ళతో మాట్లాడటం- అదీ కోర్కెలు నిండిన చూపులతో మాట్లాడటం కొత్తేమీకాదు. కాని నేనలా మాట్లాడింది శరీరం అమ్ముకునే వాళ్ళతో. రామస్వామి తెచ్చిన కూలీలతో. వాళ్ళు ఏమీ అడుగకుండానే శరీరాన్ని అప్పజెబుతుంటారు కదా?

కాని ఈమె చూస్తే మర్యాదస్తురాలి లాగా ఉన్నది కదా? ఈమె నే మని అడగటం?

* * *

మర్యాదస్తులైన స్త్రీలతో కూడా నేను మాట్లాడిన వాడినే. నేను కాలేజీలో చదువుకునే రోజుల్లో, మా దూరపు బంధువుల అమ్మాయి, మర్యాదస్తురాలైన యువతి

అక్కడే చనువుతుండేది బంధుత్వం కలిగించిన చనువు ఆమెతో షికార్లకు, సినిమాలకు వెళ్తుండేవాడిని. ఆమెను గురించిన నా ఆలోచనలు కూడా మర్యాదగానే వుండేవి. ఆ ధైర్యంతోనే నేనామెతో చనువుగా మాట్లాడేవాడ్ని.

"అవును పద్మా. ఏమిటిది? సినిమాకు వచ్చి యిలాగా వుండటం?"

"సారీ, మూర్తీ"

"అందే? హుషారుగా వుండలేననా? మనసు బాగా లేదనా? ఏమిటీ "సారీ" కి నానార్థాలు?"

నవ్వు! నవ్వింది పద్మ ఆడవానినవ్వు!

"ద్రౌపది నవ్వును చూసిన దుర్యోధనుడు అంత దుర్మార్గంగా ఆమె వలువలు వలిపించాడంటే తప్పేముంది? ఇప్పుడు నువ్వు నవ్విన నవ్వుకు నాకే మనిపించిందో తెలుసా?"

"ఏమనిపించినా యిది సినిమాహాలు. నువ్వే దుశ్శాసన కార్యమూ చెయ్యలేవనే అలా నవ్వాను."

ఆ నవ్వులాటలాడేవాడ్ని పద్మతో. కాని ఆ అనుభవంలో వికారమేమీ ఉండేది కాదు. నా ఆలోచనల్లో వికృతత్వముండేది కాదు.

* * *

కాని ఈమె కనిపించిన క్షణంనుంచి బెరుగ్గానే మాట్లాడుతున్నాను. మనసులో మాలిన్యంతో ధైర్యంగా ఎలా మాట్లాడగలను?

ఆమె వెయిటింగ్ రూములో పడుకోబోయే ముందు ఆమెతో కొంచెం సేపు మాట్లాడాలనుకున్నాను.

"అదిగో మీరా గదిలో పడుకుంటారు. నేనీ గదిలో. తలుపులు వేసుకోండేం. లేకపోతే ఈ మృగ రాక్షసుడు చిన్నారి రాచిలుకను ఏమైనా చేయగలడు" అని అందామనుకున్నాను.

"మరేం ఫరవాలేదు. మృగ రాక్షసుల ప్రాణాల చిలుకను చేతిలో పట్టుకొని, కాళ్ళు లాగి, రెక్కలు విరిచి ఏడిపించటమెట్లాగో మాకు తెలుసుగా?" అని ఆమె అంటుందని వూహించుకున్నాను.

"అయ్యో బాబోయ్ ఆబాధ భరించలేను పోనీ మీపేరైనా చెప్పండి. ఆ నామ జపమైనా చేస్తూ సుషుప్తిలోకి జారిపోతాను." అని నేను [illegible]మాడినట్లు, తన పేరు "సుశీల" అని ఆమె చెప్పినట్లు నేనే ఊహించుకున్నాను. ఆమె పేరు అసలు అది అవునో, కాదో కూడా నాకు తెలియదు.

పద్మతో మోస్తరుగా, ఈమెతో మేలమాడగలనని ఆశించానే కాని, నేనామెతో అసలు మాట్లాడనే లేకపోయాను. మురికి ఆలోచనలతో నిండిన హృదయం నుంచి పరదాలనే సుగంధాలు ఎలా రాగలవు?

కాలు గాలిన పిల్లిలా వరండాలో తిరుగుతున్నాను.

శరీరమంతా ప్రాణం చిలుకను పోగొట్టుకున్న రాక్షసుడి శరీరమల్లేనే ఉంది. ఎవరో ఒక్కొక్క నరాన్నే చిలుకలో నుంచి లాగివేస్తున్నట్లుగా శరీరంలోని నరాలన్నీ జివ్వుమంటున్నాయి. ఎలా ఈ బాధను భరించటం?

ఏ బిచ్‌నన్నా.... జాకెట్ పలహా!

ఇటువంటి పరిస్థితులలో ఆమె నన్ను తిరస్కరించదు. ఈ ఏకాంతం ఆమెనూ ప్రకోపపరుస్తూనే ఉంటుందికదా?

వయస్సులోనున్న స్త్రీ. స్త్రీలు ధైర్యంగా అడిగినవాడ్ని గౌరవిస్తారట

కాని అడగటమెట్లా? ఒక స్త్రీని తన శరీరాన్ని నాకర్పించమని ఎలా అడగాలి? ఏమీ అడగకుండానే వెళ్ళి ...ఛీ ఛీ

టి. సి. ఆమెను దింపేశాడంటే వెనకా ముందూ చూసుకోకుండా ఆమె ఈ అడవిలో దిగిపోయిందంటే, ఆమె యెంతో మర్యాదస్తురాలై వుండాలి. కుల కాంతతో దుర్మార్గము చేయుట మెలా?

* * *

పద్మ కులకాంత! ఆమెతో నేనెంతో స్వేచ్ఛగా వుండేవాడ్ని. ఆమెనుంచి నేను కోరుకున్న దేమిటో దాన్ని నిర్భయంగా ఆమెనే అడగగలిగాను

"ఏయ్ పద్మా మొన్నంటే సినిమాహాలని భయపెట్టావు. ఇవ్వాళ ఈ ఏకాంతంలో కూడా నువ్వలాగే నవ్వుతున్నావు. నేనేమైనా దుర్మార్గం చేస్తే...."

"చేస్తే... చూస్తే.... అనే కాసనోవాలంటే నాకేం భయం!"

"నేను కాసనోవానా?"

"ఇంటర్వెలుకి ముందు కాసనోవావి"

"అలా దుర్మార్గంగా మాట్లాడకు పద్మా నేనెప్పటికీ కాసనోవాని కాలేను నా మనస్సు, హృదయం అన్నీ నేనో సుందరికి యిచ్చేశాను."

"ఎవరా అదృష్టవంతురాలు.... అని నేను అడగబోవటం లేదు మూర్తీ."

"పోనీ, నేనే చెప్పేస్తాను. నా సర్వస్వమూ నిన్నే కోరుతున్నది, పద్మా. ఇది కామమను, ప్రేమను, మరొకటను ఏమైనా నేనేమీ అపవిత్ర సంబంధాన్ని కోరటంలేదు. మనం అయినవాళ్ళం పెద్దవాళ్ళను ఎదిరించటం.... లేచిపోవటం.... యిలాంటి న్యూసెన్సు పడవలసిన అవసరం మనకేంలేదు మనం పెళ్ళి చేసుకుందాం.పద్మా" అని. ఒకనాడు ధైర్యంగా ఆమెను అడిగేశాను దుర్మార్గం నా ఆలోచనల్లో లేదుకదా?

"కాని మనసు పడనకాదుగా మూర్తీ. మీ అమ్మ, మా అమ్మ అక్క చెల్లెళ్ళ వరుస."

## మిమిక్రీ మిత్రులు



### శ్రీ వీరమళ్ళ సోమరాజ్

వీరు వరంగల్ జిల్లా 'వలమిడి' అనే గ్రామంలో 1954 వ సంవత్సరంలో జన్మించారు. శ్రీ వేణు మాధవ్‌గారివద్ద ఈ కళకు సంబంధించిన అనేక సలహాలను పొందారు. విజయవాడలో 1975లో ప్రప్రథమముగా జరిగిన మిమిక్రీ నైట్‌లో మొదటిసారిగా పాల్గొన్నారు. మద్రాసు, బొంబాయి వంటి నగరాలలో కూడా ప్రదర్శనలిచ్చారు. గత సంవత్సరం వీరు హైదరాబాదు నుంచి ఒక మిమిక్రీ టీముతో అనేక చోట్ల పర్యటించి ప్రదర్శనలిచ్చారు.

వీరు నాట్యాచార్యులను అందరి నృత్య వాద్యములను యథాతథంగా ప్రదర్శిస్తారు. వీరికి మిమిక్రీ కళలోనేకాక జానపద గేయాలలో, నృత్యాలలో, సోషల్ బుర్ర కథలలో, తెలంగాణాలో ప్రాచుర్యంగా వుండే ఒగ్గు కథల్లో కూడా ప్రవేశం వుంది. బహుముఖ ప్రజ్ఞావంతులు. ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల యువజన సమాఖ్య సాంస్కృతిక విభాగంద్వారా రంగస్థల వృత్తి కళాకారుల సహాయార్థం హైదరాబాదులో వీరి ప్రదర్శన యేర్పాటు చేసి ఆ మొత్తాన్ని యువజన సమాఖ్య తరపున వీరు కళాకారునికి బహూకరించారు. ఈ కళకు విద్యాలయాలలో శిక్షణ యేర్పాటు చెయ్యాలని వీరి అభిమతం

పరిచయకర్త:

— నేరెళ్ళ లక్ష్మణరావు

"అలాగా! నాకు తెలియనే తెలియదే! అయినా ఎప్పటి వరుసలు పద్మా? తరాలు వేరైన తర్వాత యింకా పట్టింపు లేమిటి?"

"నీకు లేవు పట్టింపులు, నాకూ లేవు. లేవు కాబట్టే నీతో యిలా సరదాగా తిరుగుతున్నాను. కాని నువ్వే అంటున్నావుకదా? పెద్ద వాళ్ళను యెదిరించటం.... అదంతా న్యూసెన్సని మా పెద్దవాళ్ళు మన పెళ్ళికి ఒప్పుకోరు. కాబట్టి నీ కోర్కె నేను చెల్లించాలంటే మనమా న్యూసెన్సు పడక తప్పదు. ఆలోచించుకో. ఆ న్యూసెన్సు పడదామంటే పడదాం."

సింపిల్! ప్రాగ్మాటిక్! పద్మ చెప్పిన సమాధానం నన్నెంతో ముచ్చటగొలిపింది. ఎన్ని అభ్యంతరాలు వచ్చినా ఆమెను చేపట్టగలననే భావించాను. కాని అమ్మ చెప్పిన అభ్యంతరాన్ని త్రోసి వెయ్యలేకపోయాను. వరుస కాని పిల్లను చేసుకుంటే, నన్నూ చెల్లెళ్ళనూ అవమానించినట్లు కాదట్రా— అన్న అమ్మ మాటను ఏమని త్రోసిపుచ్చగలను?

పద్మతో చెప్పి మర్యాదగా ఆమె జీవితంనుంచి నిష్క్రమించాను.

*　　*　　*

వెయిటింగు రూము ముందు పచార్లు చేస్తున్న నాకీ గతమంతా ఒక్కసారి త్రవ్వుకొచ్చినట్లయింది.

పద్మనంత ధైర్యంగా నాకు కావలసింది అడగగలిగిన నేను, ఈమె నెందువల్ల అడగలేకపోతున్నాను?

పద్మ నుంచి నేను కోరింది జీవిత సహధర్మచారిణిని. ఇక్కడో? జాకబ్ మాటలు.... ఏ బిచ్ నన్నా.... ఈ మురికి కోర్కెతో నేనామెను ఏమని సమీపించగలను?

తళుక్కునో ఆలోచన! పోనీ, ఈమెనే పెళ్ళిచేసుకుంటే? వరుస, వాయి వెతకటానికి యిప్పుడు అమ్మలేదు. నేనే వర్ని చేసుకున్నా అన్నా, వదినెలు బాధపడరు. మనిషి చదువుకున్న దానిలాగే వుంది! టి. సి. దింపేశాడంటే సుశీలే అయ్యుండాలి? అదే అడుగుదాం?

అదే అడుగుతాను. "కామమనే అను. నేనేమీ అక్రమ సంబంధాన్ని కోరటం లేదుకదా? నేను అవివాహితుడ్ని. చదువు సంధ్యలున్నవాడిని. మనం వివాహం చేసుకుందాం ఇక్కడే ఉండిపో" అని అడిగితే?

ఇంతలో పోర్టరు దగుకుంటూవచ్చాడు. "ఏంటి బాబూ, యిట్టా వరండాలో తిరుగుతుండారు?" అంటూ.

అతనికంటె నా కక్కడ ఆప్తులెవరున్నారు? నేను చేసిన యెన్నో మురికి పనులకు అతను సాక్షి. నాయీ మంచి ఆలోచనను మాత్రం అతనితో పంచుకుంటే తప్పేముంది?

"ఏంలేదు రంగయ్యా. ఈమె యెవరో మంచి మర్యాదస్తు రాలిగా వుంది. ఏదో కష్టాల్లో చిక్కుకొని యిలా వచ్చినట్లుంది. నేనూ ఈ ఒంటరి జీవితం యెంతకాలమని గడపను? పోనీ ఈ అమ్మాయినే పెళ్ళి చేసుకుంటే? ఆమెను ఆదుకున్న వాడ్ని అవుతాను. నా కోర్కె తీర్చుకున్నవాడ్ని అవుతాను. ఆమె అందం నన్ను పిండి వేస్తూందిరా" గొంతు తగ్గించి మాట్లాడినట్లు నటించానేకాని, కిటికీలో గుండా ఆమె నా మాటలను వింటుందనే ఆశ లేకపోలేదు.

"చీ ఏంటి బాబూ, ఈ ఆలోచన్లు? టికెటు లేకుండా రైల్లో తిరిగే సరుకుని పెండ్లి సేసుకుంటారా? అంతగా మనసొగ్గకపోతే ఈరేతిరికి బులపాటం తీర్చేసుకోండి"

పోర్టరు మాత్రం బాగా గొంతు తగ్గించే మాట్లాడాడు.

"ఛా ఎలాగురా? ఆమెనేమని అడుగుతాం?"

"అడిగేదేటి బాబూ, లోనికెళ్ళి...."

"ఛీ. ఛీ. తప్పురా. ఆమె అలాటిదిగా లేదురా."

"మీరుండండి బాబూ. మీ కెందుకు. మీరా గదిలో ఒగ్గోండి. నా నంపుతాను."

మనస్సు చల్లబడింది - మురికిగుంటలో స్నానం చేసినట్లు పవిత్రత మటుమాయమైపోయింది. ఆమే గదిలోకి వస్తే.. అడగటమనే బాధ లేదుగా?

అయితే ఆమె అంత తేలిగ్గా అంగీకరిస్తుందా? అంగీకరించే రకమే అయితే, అలావెళ్ళి పడుకోమనగానే వెళ్ళి పడుకుంటుందా? కబుర్లేసుకొని కూచుండేదికాదూ? ఈ ఒంటరితనం ఆమెనూ కాగిస్తూనే ఉంటుందికదా? మగవాడ్ని, నేను బెరుకు పడటంలో అర్థముంది. ఆమే వచ్చి కోరితే కాదంటానా? రాకూడదూ?

ఏదో కోపం! ఆమె తానుగా వచ్చి పతితురాలు కాలేదని నాకు కోపం!

ఇప్పుడు పతితురాలు కావటానికి యింతకు ముందేమన్నా మహా పతివ్రతా ఏమిటి? ఇంత వయసొచ్చి, అంతగా యౌవనపు పొరలను శరీరమంతా కప్పుకొన్న స్త్రీ, కామంతో శరీర భాగాలనన్నింటినీ నింపుకునే వుంటుంది. లేకపోతే పమిటన్నా నిండుగా కప్పుకోదా- ఈ ఒంటరితనంలో?

మరి అంత ధైర్యమే నాకున్నప్పుడు నేనే వెళ్ళి ఆమెను పొందవచ్చును గదా? పోర్టరుతో రాయబారమెందుకు? వాడు చేసిన ఎంగిలి నాకెందుకు?

ఎంగిలి చెస్తాడా... వెధవ?

గబుక్కునలేచి బయటకొచ్చాను. వెయిటింగు రూములోనుంచి కేకలు!

"ఫూల్. రాస్కెల్. నేనేమన్నా ప్రాసిట్యూట్ ననుకున్నావురా, గాడిదా!" ఆమె గొంతు.

"ఏంరమ్మగారూ, యిటాటిసోటికొచ్చి, కబుర్లు సెపుతారేటి?" పోర్టరు ముందర్లకు తూలుతున్నాడు.

"ఏమన్నావురా రాస్కెలు."

ఆమె చెప్పు వాడి ముఖంపై వీరవిహారం చేసింది నేను పెట్టే కేకలనామె వినిపించుకోనేలేదు. వాడి ముఖమంతా వుబ్బిపోయి వాడు నేలపై పడిపోయాడు.

వచ్చి తలుపు తీసింది.

"ఏమిట్రాయిది?" అని పోర్టరును కసిరాను.

"సూడండి బాబూ ఈయమ్మ నన్ను పిలిచి మీ సంగతి అడుగుతూనే మీద పడి కొట్టేసినాది బాబూ."

అది అబద్ధమని నాకు తెల్సు. నాకు తెల్సునని వాడికీ తెల్సు. ఆమెకూ తెల్సునా?

"ఏంటమ్మా యిది?" ఆమెను సంజాయిషీ అడిగాను. దోషి నిర్దోషిని అడిగిన సంజాయిషీ అది!

"నేను చెప్పాలా. చూస్తున్నారుగా?"

"అలా వాడ్ని పట్టుకు బాదటమేమిటి చెప్పండి"

"నీకా ప్రశ్నకు సమాధానం చెప్పను తమ్ముడూ."

"ఏమైనా ఆడవాళ్ళు అలా ఉద్రేకపడవచ్చా? ఏదన్నా జరిగితే నాతో చెప్పాలి. అదీగాక మీ రేదో అవకాశమివ్వకపోతే వాడలా దురుసుగా ప్రవర్తిస్తాడా? ఆడది అలుసివ్వకపోతే మగవాడు ధైర్యం చేస్తాడేమిటి?"

పోర్టరుని తీసుకొని బయటకొచ్చేశాను. నా కసి తీరినట్లయింది- ఆమెనామాట అనటంతో.

పతివ్రత కబుర్లు చెబుతుందేం, లేకపోతే తమ్ముడట. నా కన్న చిన్నదానినంటూనే నన్ను తమ్ముడంటుందేమిటి?

ఆమెనలా అవమానించటంతో ఏదో సంతృప్తి! ఏనుగులను విరుచుకుతిన్న రాక్షసులకు కలిగే తృప్తి! ఏనుగులను తిన్న రాక్షసి అందమైన యువతిగా మారి కులికినట్లు కులికింది, నా మనసు— ఆమెనలా అనటంతో.

కాని ఎంతసేపు?

నేనా మాట అన్నప్పుడు నన్నామె చూసిన చూపు!

ఆమెను తప్పించుకొని బయటకు వచ్చానేకాని, ఆ చూపునుంచి తప్పించుకోలేకపోయాను.

తప్పించుకోలేకపోతున్నాను. యిప్పటికీ.

* * *

ఇప్పుడామె పక్కగదిలో శవంగా వున్నది. చనిపోయికూడా నన్ను అదే చూపుతో చూస్తున్నట్లున్నది. ఆడది అలుసివ్వకపోతే.... అనే నా దుర్మార్గపు అభియోగానికి ఆమె సమాధానం చెప్తున్నట్లే వుంది.

నా మనస్సంతా కుళ్ళగుంటలా, టాయిలెట్ గదిలా వుంది. రూము బయటకు వచ్చి ప్లాటుఫాంపై నిలబడ్డాను.

చుట్టూ చెట్లు. సూర్యకిరణాలను భూమిని తాకనీయక మింగివేస్తున్న చెట్లగుబురులు. స్వచ్ఛతకు ఆ వాతావరణంలో అసలు చోటే లేదేమో?

దారీ. తెన్నూలేని అడవి - స్టేషను చుట్టూ. అక్కడ దారి వెతుక్కోవటమే తప్పేమో?

ఎటు చూసినా కుంకుళ్ళు. విస్కీ బ్రాందీలు ఈ కుంకుళ్ళ రసంలాగా చేదుగా ఉంటై. చెడు ఎప్పుడూ చేదుగానే వుంటుంది. ఆ చేదును పట్టించుకోకుండా తాగినవాడికే విస్కీ ఆనందాన్ని యిస్తుంది. అలా చేయలేనివాడు అసలా విస్కీ తాగకుండా వుండటమే మంచిదేమో? చెడు చేసే వానికి ఆలోచనలుండకూడదేమో?

రామస్వామి ఏ కూలీ పిల్లనో పెట్టుకొని, ఏ చెట్టు మాటునో........ జాకబ్ ఈపాటికప్పుడే డ్యూటీ దిగి, మందుకొట్టి ఏ బిచ్‌నో.... వారికి మంచి చెడుల విశ్లేషణ తెలియదు.

తెలియకపోవటమే మంచిదేమో?

వాటిని విశ్లేషణచేస్తూ, చెడుచేసే దానికంటే అసలా విశ్లేషణ చేయకపోవటమే మంచిదేమో?

నేనామెను గురించి అతిగా ఆలోచించానేమో?

ఏమీ ఆలోచించకుండా ఆమెను చేరినట్లయితే, ఆమె యిలా ప్రాణం తీసుకొనేది కాదేమో? నన్నుకూడా కొట్టి, తనకోపం తనకు కలిగిన అవమానం చల్లార్చుకొని, ప్రాణాలతో ఉండేదేమో?

నేనే ఆమెను చంపినట్లున్నాను.మంచిగా ఆమెకు ఆతిధ్యమిచ్చి, దుర్మార్గంగా మాట్లాడి ఆమె గుండెను చాకిరం పెట్టినట్లున్నాను. ఏ కష్టంలోనో వుండి, ఏ దుర్మార్గంనుంచో పారిపోతున్న స్త్రీని నా దుర్మార్గానికి బలిచేసినట్లున్నాను.

## కాళోజీ కవితాసూక్తులు

చెక్కభజనకు చుక్కలు
సంగీతానికి చింతకాయలు రాలవు

* * *

'లా' వాక్కింతయు లేదు
'ఆర్డరు' విలోలంబాయె

* * *

'ఒకే దేశ మొకే జట్టు
ఒకే నేత' అనెడి కూత
ప్రజాస్వామ్య హననానికి
ప్రతిపాదన అవునా కాదా?

* * *

కన్నీటి చుక్కలో కడలు లుప్పొంగు
కన్నీటిలో మునుగు కైలాస గిరులు

* * *

ఆర్జించెడి వారులేక
ఆరగించు వారుండిన
అమర తరువు కుబేరాస్తి
ఆగలేవు అంతమొందు

* * *

మంచిమాట మావోడు చెప్పినా
మావో చెప్పినా ఒక్కటే

* * *

తిన్నగజూస్తే ఎన్నిక హేళన
బ్యాలెట్ పేపర్ బ్యాఁ బ్యాఁ బ్యాఁ
బ్యాంకు నోటుకు బుల్లెటు ఆసర
గుడుగుడు గుంచెం గుండేరాగం
గూడుపుఠానీ గూండారాజ్యం

* * *

ప్రభుత్వాల మోసాలను ప్రతిభఅనకు
తిరగబడిన ప్రజలపైన విరగపడకు

* * *

అక్షర జగత్తులోన గురు లఘువుల
సమాగమము ప్రతిఫలము ప్రతిపదము

[సంక్రాంతి మిత్రులు ప్రచురణ "నా గొడవ" నుంచి.]

---

ఎందుకు చేశానీ పనిని?

ఒంటరితనం! ఇదివన్నోవ ఖవుగా మారుస్తున్నది. దీనినుంచి తప్పించుకు పోవాలి.

మరిప్పుడీ పాపానికి నిష్కృతి ఏమిటి?

డాక్టరు పోస్టుమార్టంచేసి ఆమె గర్భవతి అని తేలిస్తే? అప్పుడు నాకీ ఆవేదన తగ్గవచ్చు.

ఆయనలా చెప్పకపోతే? ఆమె పవిత్రురాలే అయివుంటే? ఎలా తెలుస్తుంది నాకీ సత్యం?

* * *

అచేతనంగా వెయిటింగు రూములోకెళ్ళి, ఆ శవం వంకే చూస్తూ కూర్చున్నాను. నాకు భయమెలా కలుగలేదో? ఒంటరి గదిలో, శవం తోడుగా ఎంత సేపున్నానో?

"నేనా ప్రశ్నకు సమాధానం చెప్పను, తమ్ముడూ" ఆమె ముఖం నా ప్రశ్నలకు వేటికీ సమాధానం చెప్పటం లేదు.

నా ప్రశ్నల కసలు సమాధానమే లేదేమో? ఎంత ఉద్రేకంగా కొట్టింది, పోర్టర్ని!

ఓ.... ఆమె ఎవరో గుర్తుకొచ్చింది. ఆ ముఖాన్ని నేనెక్కడచూశానో గుర్తుకొచ్చింది. ఆమె పేరైతే నాకు తెలీదుకాని ఆమె మా కాలేజీలోనే చదువుకున్నది. సైన్సు స్టూడెంటు. ఒకసారి వాళ్ళ బాటనీ లెక్చరరు ఏదో అన్నాడని, ఆ ముసలాడి ముఖాన్ని చెప్పుతో వాయకొట్టేసింది. తర్వాత కాలేజీనే వదిలి వెళ్ళింది.

నా ప్రశ్నలకేదో సమాధానం— ఆమె పవిత్రురాలు! ఏదో దుర్మార్గం నుంచే ఆమె పారిపోతున్నది.

ఆడది అలుసివ్వకపోతే.... హయ్యో.... ఎంత దుర్మార్గంగా మాట్లాడాను?

ఆమె ముఖంవంకే చూస్తున్న నాకేదో మైకం కమ్మింది.

* * *

రివ్వున వీచిన గాలితెర తలుపులను బ్రద్దలు కొట్టింది. ఏదో కాగితం, ఎగురుకుంటూ వచ్చి నామీద పడింది.

ఆమె వ్రాసిన వుత్తరం!........ అబ్బో పెద్ద వుత్తరమే! ఇలా చదువుకున్నా - ఆ మైకంలో నుంచే.

"ఆడది అలుసివ్వకపోతే మగవాడు ధైర్యం చేస్తాడేమిటి? మంచి ప్రశ్నే వేశావు తమ్ముడూ. సమాధానంగా నా జీవితంలోని కొన్ని ఘట్టాలనే నీ ముందుంచుతాను. నేనెవరో నువ్వు గుర్తుపట్టినట్లులేదు. నేను నిన్ను గుర్తుపట్టాను. మనిద్దరం ఒకే కాలేజీలో చదివాం. మా బాటనీ లెక్చెరరు, యాభైయేళ్ళవాడు. ఒకసారి లాబ్‌కి నన్ను పిలిపించి "చూడమ్మా ఈ రికార్డులిలా తగలేస్తే ఎట్లాచెప్పు. క్లాసుకోసం ప్రయత్నిస్తున్నావంటివి. జాగ్రత్తగా వ్రాయవద్దు" అంటూ నామీద చెయివేసి, వీపు నిమురుతూ ఏవో బుద్ధులు గరపసాగాడు. పెద్దవాడు. ఆయన చేయి నాలో ఏ వికారాన్ని కలిగించలేదు.

కాని జాకెట్టు వెనుక గుండీలు ఊడేటప్పటికి ఆ ఛండాలుని స్వరూపం అర్థమైంది. ఆవేశం కట్టలు తెగిపోయింది. హైహీల్సు ఆ ముసలి ముఖంపై వీరవిహారం చేసింది. ముఖమంతా వాచిపోయి. కళ్ళజోడు పగిలిపోయి, బాధతో ఆయన మూలుగుతుంటే, హత్య జరిగిపోయిందనే అనుకున్నాను. అయినా భయం కలుగలేదంటే నమ్ముతావా? కాకపోతే ఆవేశం చల్లబడింది. వెళ్ళి ప్రిన్సిపాలుతో రిపోర్టు చేశాను. ఆయనేమన్నాడో తెలుసా? నీలాగే అన్నాడు. "చూడమ్మా. ఆడపిల్లలు అలా ఆవేశపడవచ్చా? నాతో చెప్పాలి. కాకపోయినా మీరేదో అలుసివ్వకపోతే మగవాడలా పిచ్చి పనులు చేస్తాడా?"

అప్పుడు నాకు గుర్తుకొచ్చింది తమ్ముడూ. బాటనీ లెక్చెరరు భార్యకు, కాలేజీ కమిటీ ప్రెసిడెంటుకు వున్న సంబంధం.

ఆ ప్రిన్సిపాలుమీద నాకు కలిగిన అసహ్యం నన్నొక యోగి పుంగవురాలిగా మార్చింది. "పెద్దవారు అలా పావంగా మాట్లాడకండి మిమ్మల్నికన్నతల్లిని వేశ్యను చేయకండి. మేము అలుసిచ్చామంటారా?" అని, గిర్రున వచ్చేశాను. ఇంత జరిగిన తర్వాత, నేనా కాలేజీలో చదవలేదనేది నీకు తెలిసినదేగదా? నేను అలుసివ్వబట్టే, ఆ ముసలాడలా చేశాడేమో యిప్పుడు చెప్పు.

తర్వాత ఎప్పుడో మా అక్కయ్యగారింటికి వెళ్ళాను. అది లేవలేని మనిషి. దానికి సాయంగా పదిరోజులుందామని వెళ్ళాను. దానికప్పటికే నలుగు పిల్లలు. పుల్లలా ఉంది. బావ గవర్నమెంటు హాస్పిటల్లో హెడ్‌క్లర్కు. పుష్టిగా వుండేవాడు. రెండు చేతులా సంపాదన. ఒక రోజున నాతో సరసాలు ప్రారంభించాడు. మీద చేతులు వేసేటంతవరకు దుస్సాహసం చేశాడు. నాకతని వికారంచూస్తే అసహ్యం కలిగిందిగాని, కోపం రాలేదు. "బావగారూ, నేను ఒప్పుకుంటా ననుకోండి. మరి అక్కయ్య నేం చేస్తారు?" అంటూ ఆయనచేత మరికొంత విషాన్ని కక్కించావని ప్రయత్నించాను. "దాందేముంది. సుశీ. ఏదో ట్రీటుమెంటుకని పదిరోజులు హాస్పిటల్లో చేర్పిద్దాం మనం హాయిగా వుందాం. ఏమంటావు?" అంటూ విషాన్ని కక్కేశాడు.

జరిగిందంతా అక్కయ్యతో చెప్పాను, కాని అక్కయ్య ఆయన్నే సమర్థించింది. అది చూస్తే నాకీ మనుష్యులు భగవంతుడి సృష్టేనా అని అనుమానమేసింది. ఎవరో వికార రాక్షసులు, భగవంతుడి మీది పగతో, యీ దుర్మార్గపు మానవులను సృష్టించి, ఆ నిందను భగవానునిపై వేశారనిపించింది. ఇద్దరం ఒక రక్తం పంచుకొని పుట్టినవాళ్ళమేగా? అయినా ఏమందో తెలుసా? "అదికాదే సుశీ నువ్వసలు ఆయనగదిలో కెందుకెళ్ళావు? ఆయనసలే చెడు తిరుగుళ్ళు తిరిగే మనిషి. ఎలాగో పట్టుకొస్తున్నాను. కాకపోయినా ఆడది అలుసివ్వకపోతే మగవాడు సాహసం చేస్తాడేమిటి?" అంది అక్కయ్య.

అక్క ప్రశ్నకు నేను సమాధానం చెప్పలేదు. చెప్పి, నన్ను నేను అవమానించుకోదలుచుకోలేదు. కాని అక్కయ్యను నేనెంతగా అసహ్యించుకున్నానంటే, యిప్పుడా అక్క బతికే ఉందో, చచ్చేపోయిందోకూడా నాకు తెలియదు.

ఇలా అసహ్యించుకునే అవకాశమున్నంతవరకు ఈ ప్రపంచాన్ని అసహ్యించుకున్నాను. ఆ అసహ్యమే నాకు జీవితాన్ని యిచ్చింది. ఆ అసహ్యమే కలుగకపోతే, నేనీ మగవాళ్ళలో చూసిన కాముదేవత వికృత స్వరూపం, నన్నేనాడో శక్తిహీనురాలిని చేసి ప్రాణాలు తీసి వుండేది.


కాని అమ్మను ఎల్లా అసహ్యించుకునేది? తన రక్తాన్ని నాకు పంచి యిచ్చిన తల్లి, తన రక్తాన్ని తానే అవమానించుకుంటూ వుంటే నాకు అసహ్యమెలా కలుగుతుంది?

లాబ్‌లో అసిస్టెంటుగా చేరాను. మానవాళి పురోభివృద్ధికి- సైన్సు పురోగతికి తోడ్పడుదామని కాదు. పెళ్ళికూతురుగా. మరో అర్హత సంపాదించుకోటానికి. అన్నయ్య వన్నీ ప్రోలిటేరియను భావాలు. ప్రతి వ్యక్తి యూజ్‌ఫుల్ వర్కు చెయ్యాలంటూ అమ్మచేత అల్లిక పని, భార్య చేత కుట్టుపని చేయిస్తుండేవాడు. మా లాబ్ డైరెక్టరు ఓ రోజున నా మీదకు వచ్చాడు ఆకలితో. ఆయనెంత వికారంగా వుండేవాడనుకున్నావు? జిరాఫీ మెడ. గూబకళ్ళు గాడిదకాళ్ళు- సృష్టిలోని వికార జంతువుల అవయవాలన్నీ పేర్చి నిర్మించిన వింత మృగంలా ఉండేవాడు. ఆయనభార్య అప్పుడప్పుడు ఈ సుందరాంగుడిమీద నిఘా వేయటానికి, ఊరవతలఉన్న మా లాబ్‌కి వస్తుండేది. పిప్పళ్ళ బస్తాలా ఉండేది, ఆమె.

నన్నుకోరిన ఆ వికృతరూపాన్ని చూసి నేనేదో ఎమ్యూజ్ అయ్యాను. "అది సరే సర్. మనం యిక్కడ ఉండగా మీ మిసెస్ వస్తారేమో?" అని ఆయన్ని ఉడికించాను. "వచ్చినా లోపలికి రావటానికి ద్వారం పట్టదుగా?" అంటూ తన విట్టుకు తానే పళ్ళు ప్రదర్శనలో పెట్టాడు. చేతికందిన ఆసిడు బాటిలు ఆయన ముఖాన కొట్టి వచ్చేశాను.

ఉద్యోగం వదిలేశానంటే అమ్మ ఏమందో తెలుసా? "ఆయనేదో దుర్మార్గం చేశాడని. బంగారంలాంటి ఉద్యోగం మానుకుంటామా? ఈ సంగతి తెలిస్తే అన్నయ్య మనల్ని ఇంట్లో ఉండనిస్తాడా? మనం మంచిగా ఉంటే మగవాడేం చేయగలడే? ఆడది అలుసివ్వకపోతే మగవాడు ముందడుగు వేయగలడా?" అంది అమ్మ. నన్ను కన్న తల్లి!

ఏమనేది నేను? లోకం తీరుగా ఊరికే ఆ మాట అన్నదనుకొనేదా? నన్నే అనుమానిస్తున్నదనుకొనేదా? ఆ ప్రశ్న యిదివరలో విన్నాను. అసహ్యం వేసింది. చెప్పానుకదూ. ఆ అసహ్యమే నన్ను



కాపాడింది. కన్నతల్లిని ఏమని అసహ్యించుకొనేది? ఆమెకు సమాధానం చెప్పి, నాది తప్పులేదని నిరూపించుకొని, నన్ను నేను అవమానించుకొనేదా?

అందుకే పిచ్చిగా యిల్లువదలి వచ్చేశాను. టిక్కెట్టు కొనుక్కోవాలనే జ్ఞానమే వుంటే అసలు వచ్చి వుండేదాన్ని కాదేమో. డబ్బు తెచ్చుకోవాలని గుర్తేవుంటే ఫస్టు క్లాసులో యెక్కేదాన్నైనా అసలు?

ఆ టికెట్టు కలెక్టరు అతనూ మగవాడే. ... బజాయిదాన్ననే అనుకున్నాడు. "హాయ్ ... సెకండు క్లాసులో కూచుందురు రండి. అక్కడెవరూ వుండరు" అని పళ్ళికిలించాడు.

దాంతో నాకు అమృతం తాగినట్లయింది. ఆ కుళ్ళు ముఖం. ఆ మురికి మాటలు. అవి నన్ను క్షణక్షణాన అసహ్యంతో నింపివేసినై. అతనిమీద, ఈ రాక్షస సృష్టిమీద ఆ క్షణంలో నాకు కలిగిన అసహ్యం — నన్నొక కోమా నుంచి బయటపడవేసింది ఈ ప్రపంచంలోకి తిరిగి వెళ్ళు. ఈ దయ్యపు రూపంతో యుద్ధం చేయాలనే స్ఫూర్తినిచ్చింది. "సారీ వచ్చే స్టేషనులో దిగిపోతాను" అని మాత్రమే అనగలిగాను.

కాని యిక్కడేం జరిగింది? ఒక పోర్టరు నన్ను సమీపిస్తాడా? ముక్కుమొగం ఎరగని నువ్వు ఆడది అలుసివ్వకపోతే ... అంటూ దీర్ఘాలు తీస్తావా?

కాని ఏమిటిది, ఎంతగా ప్రయత్నించినా నీమీద అసహ్యం కలగదేం? ఈ ప్రపంచాన్ని అసహ్యించుకోవటం నాకిక్కడ చేతకావటం లేదేమిటి? ఈ వికృత సమాజంతో పోట్లాడే శక్తిని, నిన్నుచూసి పోగొట్టుకున్నట్లున్నానేమిటి?

కాలేజీరోజుల్లో నిన్ను గురించి నాకేమీ తెలియదుకదా? నిన్ను చూసింది ఈ కొద్ది క్షణాలేకదా? నీవున్న ఒంటరితనంలో నువ్వు నామీద దుర్మార్గం చేయపూనుకోలేదంటే, నాకేదో గౌరవ భావం కలుగుతున్నదేమిటి? నువ్వు వరండాలో తిరగటం చూశాను. నన్ను చేరాలని పడ్డ ఆరాటం గుర్తించాను. అది నీ ఒంటరితనం కల్గించిన వికార మనుకుంటాను. అయినా నీ ఆలోచనలు గౌరవ మార్గానే నడిచినై అంటే నాకేదో గౌరవమే కలుగుతున్నది. పోర్టరుతో నీవన్న మాటలు మనమేదో శాశ్వత బంధాన్ని యేర్పాటు చేసుకోవాలన్న నీ ఆలోచన అది క్షణికమే కావచ్చు కాని అది నాలో యేదో నాబిలిటీని ప్రేరేపిస్తున్న దేమిటి? అసహ్యానికి నన్ను యిర్రెకాపబుల్ చేస్తున్న దేమిటి?

నువ్వు వేసిన ప్రశ్నకు నాకు అసహ్యం

## ఇదో టుమ్రీ

దేశ భాషలందు
తెలుగు Less
తెలుగునాట
అది పూర్తిగా Miss.

"సింహం"

కలగటంలేదు తమ్ముడూ. అసహ్యం కలగకపోతే నేను జీవించగలనా? అపరిచిత వ్యక్తులచేత యిలా అవమానాలు పొందుతూ. ఈ కారడవిలో, ఈ కామపు కీకారణ్యంలో దారి వెతుక్కోవాలనే ప్రలోభం నాకెందుకు?

కన్యల కొలను గురించి నువ్వు చెప్పిన విషయం నన్నెంతో ఉత్సాహపరిచింది. జీవితమంతా ఈ మురికి కూపంలో గడపటంకంటె. ఆ పవిత్ర సరోవరంలో మరణించటం మేలుకదా? వయసు వచ్చినప్పటినుంచీ నా అందమే నాకు శాపంగా యిరుకుగా, మురికిగా జీవితాన్ని గడుపుకొస్తున్న నేను, చావులో ప్రశాంతతను పొందబోతున్నాను. పవిత్రత నందుకోబోతున్నాను.


ఆ ప్రశాంతతను పొందబోయేముందు, జీవితమంతా నన్ను వెంబడించి. వేటాడిన ప్రశ్నకు సమాధానం చెప్పదలచుకున్నాను. ఎవరికీ చెప్పని సమాధానం నీకే ఎందుకు చెప్తున్నాను? ఏమో? ఆ సమాధానం నేను చెప్పదలచుకున్న సమయానికి ఆ ప్రశ్న వేసినవాడివి నీవు కావటమే అందుకు కారణమేమో?

ఆడది అలుసివ్వకపోతే మగవాడు పిచ్చిపనులు చేయడా? సీతాదేవి అలుసిస్తేనే రావణుడామెను చెరబట్టాడా? పరమ పవిత్రమూర్తి అహల్య. ఆ పేరులోవున్న సొగసు చూశావా? వళ్ళు పులకరించే పవిత్రతకాదూ ఆమెది. ఆమె అలుసిస్తేనే యింద్రుడామెను కోరి వచ్చాడా?

ఈ నాటి కీనాడు! నేను ఒంటరిదాన్ని. ప్రత్యేక పరిస్థితుల్లో నీ అతిధినైనాను. నువ్వు నన్ను గురించి ఏమని ఆలోచించావో నీ మనస్సుని వెతుక్కో. నాకు నీతినియమాలు వుంటయ్యనే ఊహ నీ మనస్సుకు పట్టిందా! పడే పోర్టరుతో రాయబారమంపుతావా? నన్ను గురించి వికృతంగా ఆలోచించే అవకాశాన్ని నేను నీకు యిచ్చానా? నిన్ను చూస్తుంటే మా తమ్ముడు గుర్తుకొస్తున్నాడని అనలేదా? నాకంటె పెద్దవాడివి. నీవు నాకు తమ్ముడివేమిటి?

నేను జీవితాన్ని చూసినదాన్ని. నీవు చీకటిలో కూర్చున్న వాడివి, భగవంతుడు ప్రేమను సృష్టిస్తే. పగ బూనిన రాక్షసులు కామాన్ని సృష్టించారు. ఈ సత్యం నాకు తెలుసు నీకు తెలియదు.

ఆడది అలుసివ్వకపోతే - అని ప్రశ్నించావు ఆ ప్రశ్నకు సమాధానం నీకు తెలియదు - నాకు తెలుసు అంతేకాదు. ఆ ప్రశ్నను ఎందుకు వేస్తారో కూడా నాకు తెలుసు. నువ్వు నన్ను పొందాలని చూశావు. వచ్చి అడిగే దుర్మార్గం మాత్రం చెయ్యలేకపోయావు. కానీ దుర్మార్గం నీ మనస్సులో వున్నదేగా? దానినంతా



# మల్లెపందిరి

## కృష్ణ కర్ణామృతం

"అమ్మా!" 'ఏం కృష్ణయ్యా?' 'ముంత ఇవ్వవమ్మా' 'అదెందుకు?' 'పాలు తాగడానికి' 'ఇప్పుడు లేవు' 'ఎప్పుడుంటాయి?' 'రాత్రి' 'రాత్రంటే?' 'చీకటిపడ్డాక' 'అయితే రాత్రి వచ్చేసింది. పాలియ్యి.' అంటూ కళ్ళుమూసుకుని తల్లి పైటచెంగును మరి మరి లాగుతున్న కృష్ణుడి చిలిపి తెలివి చూశారా? కళ్ళు మూసుకుంటే చీకటిపడ్డట్టే, రాత్రి వచ్చేసినట్టే— కనుక వెంటనే పాలు రావాలి అంటాడు.

**మాతః, కిం యదునాథ, దేహి చషకం, కిం తేన,**
**పాతుం పయః**
**తన్నాస్త్యద్య, కదాస్తి వా, నిశి నిశా కా వా, అంధకారోదయే**
**ఆమీల్యాక్షియుగం 'నిశాప్యుపగతా దేహీ'తి మాతు ర్ముహు**
**ర్వక్షోజాంబర కర్షణోద్యతకరః కృష్ణస్స పుష్ణాతు నః॥**

—సౌభరి

నీ ప్రశ్నలో వెలిగక్కావు.

గౌతముడంతటివాడు అహల్యనే శపించాడు. తమలోని బలహీనతను తమనుంచి కూడా దాచుకోవాలని ప్రయత్నించే బలహీన మనస్కులు ఆ ప్రశ్న వేస్తారు తమ్ముడూ. తమ తల్లులను వేశ్యలుగా మారుస్తున్నామని తెలియక ఆ ప్రశ్న వేస్తారు తమ్ముడూ.

ఇది నీకు తెలియదు. నాకు తెలుసు. అందుకే నేను నీకు అక్కయ్యను.

కాని నువ్వు నా మాటలలోని ఆప్యాయతను గుర్తించావా? కామంతో కళ్ళు పొరలు కమ్మిన నీకు సత్యం కనిపించిందా? నేను అలుసు యివ్వబట్టే నువ్వలా ప్రవర్తించావా?

నీ ప్రశ్నకు నీవే సమాధానం చెప్పుకో.

ఆడది అలుసివ్వకపోయినా...... అని నువ్వు అర్థం చేసుకోగలిగితే ఈ పవిత్రురాలి శరీరంపై ఒక్క అడవి పువ్వునుంచు ఏ లోకంలో వున్నా చూసి సంతోషిస్తాను. సెలవు తమ్ముడూ"

.... .... .... .... ....

ఉత్తరాన్ని చదువుతున్న కళ్ళు నీటిబుగ్గలౌతున్నాయి. అక్షరాలేవో అలికినట్లవుతున్నాయి.

"అయ్యగారూ."

పోర్టరు పిలుస్తున్నాడు ఉలిక్కిపడి లేచాను.

"ఏంటి బాబూ. ఈ గదిలో నిద్రోతున్నారు?"

"నిద్రపోతున్నానా?"

.... .... .... .... ....

"ఏంటి బాబూ ఎతుకుతుండారు?"

"ఉత్తరం రా"

"ఉత్తరమేటి బాబూ"

"అదేరా, ఆమె వ్రాసిన ఉత్తరం. తన కథనంతా చెప్తూ ఆమె పెద్ద వుత్తరం వ్రాసిందిరా."

"పెద్ద వుత్తరమా? ఉత్తరం రాయటాని కాయమ్మకు కలం, కాగితాలు యెక్కడివి బాబూ."

ఆఁ నిజమే.

అయితే ఆమె వుత్తరం వ్రాయలేదా?

నేను చదివింది ఆమె వుత్తరాన్ని కాదా?

ఇదంతా నేను అల్లుకున్న కల్పనేనా?

ఏమిటీ. యింత పవిత్రమైన కథను నేనామె చుటూ అల్లుకోగలిగానా? నా మనస్సుకి యింకా యింతటి నిర్మలత వున్నదా? నా ఊహాశక్తికి యింకా పూర్తిగా కొత్త్రు పట్టలేదన్నమాట

ఛీ ఛీ. ఈ ఉద్యోగం! ఈ ఒంటరితనం! ఇది నన్నో పశువుగా మారుస్తుంది. తప్పదు

రామస్వామిలాగా. జాకబ్‌లాగా నేనో భ్రష్టుడ్ని అవుతాను.

పొగడపూలు వాడిపోయికూడా సువాసనలనిస్తాయి. కాని అందరికీ ఆ అదృష్టం పడ్తుందా?

నా ఆలోచనా స్రవంతిని ఈ ఒంటరితనం పూర్తిగా మురికిగుంటగా మార్చక ముందే నేనీ ఉద్యోగాన్ని ఒంటరితనాన్ని వదిలి వెళ్ళిపోవాలి.

ప్లాటుఫాం మీదకు వచ్చాను.

ఎవరు వేశారో ప్లాటుఫాం పొడుగునా పొగడచెట్లు? వాటి పూలవాసనలు, నా యీ రెండేళ్ళ పాపాలను ప్రక్షాళితం చేస్తున్నట్లున్నాయి.

ఈ అడవిలో నాకు దొరికేపూలే అవి. వాటినే దోసిటినిండా పోగుచేసుకొని వెళ్ళి ఆమె- "సుశీల"- శవంపై ఉంచాను.

ఏ లోకాన ఉన్నదో. చూసి సంతోషిస్తుంది. నాకింకా ఆ నమ్మకమున్నది.

కాని నా ఒంటరితనం నాలోని ఈ నమ్మకాల నన్నింటిని నాశనం చేస్తుంది. నన్నో రాక్షసుడ్ని చేస్తుంది. నన్నో జాకబ్‌ని చేస్తుంది. తప్పదు.

నా మనస్సు పూర్తిగా వికృతం కాకముందే మంచి చెడుల విశ్లేషణను చెయ్యలేని దౌర్భాగ్యంలో పూర్తిగా పడిపోకముందే నా మనో పటం చిరిగి వాలికలు కాకముందే నేనీ ఒంటరితనాన్ని వదిలి వెళ్ళిపోవాలి.

*　*　*

సాయంత్రం లోకలు వచ్చింది బిలబిలమంటూ పోలీసులు, వింత చూడవచ్చిన జనాలు దిగివచ్చారు. ఆ రాత్రంతా స్టేషను కోలాహలంగానే వుంది.

తెల్లవారింది. రెండో ఎ.ఎస్. ఎమ్.కి ఛార్జీ వప్పగించాను.

సుశీల శవంతోపాటే నేనూ ప్రయాణం చేసి వచ్చేశాను. ఆ ఒంటరితనాన్ని వెనుక వదిలి వచ్చేశాను శీల సంరక్షణార్థం!

★

## బంగారు గుడ్డు

రోజుకు ఒకే ఆలోచన వస్తుంటే
ఓపిక పట్టలేక
ఓనాడు
బుర్ర బద్దలుకొట్టుకున్నా
ఏముందీ?
అంతా
మృణ్మయం.

—ప్రసాద్ ఎమ్వీఎస్.